క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి



ముత్తంశెట్టికి ప్రసాదం అందజేస్తున్న ఏఈవో భ్రమరాంబ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు.ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు.ఆయన వెంట జేసీఎస్ కన్వీనర్ లంక సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎర్ర వరహానరసింహం, శిడగం తాతబాబు, ఎస్.అప్పారావు ఉన్నారు.

ఘనంగా అప్పన్న నిత్యకల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

మణిపూర్ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలకు డిమాండ్



వాడచీపురుపల్లిలో నిరసన తెలుపుతున్న ఐద్వా సభ్యులు

పరవాడ: మణిపూర్ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. వాడచీపురుపల్లిలో శనివారం ఐద్వా ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ ముగ్గురు మహిళలపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఐద్వా సభ్యులు ఆదిలక్ష్మి, నూకరత్నం, రత్నకుమారి, గండి లక్ష్మి, సత్యవతి, పార్వతి, నూకాలమ్మ పాల్గొన్నారు.

పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

- సీఐ అశోక్‌కుమార్

సింహాచలం: పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని పెందుర్తి ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ సూచించారు. పెందుర్తి పరిధిలోని 23 పాఠశాలలు, కళాశాల ప్రిన్సిపాల్స్, వెహికల్స్ ఇన్‌చార్జి, పీఆర్‌వోలతో శనివారం సీఐ సమావేశం నిర్వహించారు. విద్యాసంస్థల బస్సులు విధిగా కండిషన్‌లో ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు యాజమాన్యాలు బస్సుల పరిస్థితిని తనిఖీలు చేయాలని సూచించారు. ఇకపై పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశంలో తాము కూడా పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్‌కు ఐకానిక్ అవార్డు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్‌కు ఐకానిక్ లీడర్‌షిప్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్ అవార్డు–2023 లభించింది. న్యూఢిల్లీలో శనివారం జరిగిన న్యూ నార్మల్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ సమ్మిట్–2023 కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ కార్యదర్శి ప్రొఫెసర్ ప్రత్యూషకుమార్, స్కిల్ ఎడ్యుకేషన్ సీబీఎస్ఈ డైరెక్టర్ డాక్టర్ బిశ్వాజిత్ సాహు, ఎన్‌సీఈఆర్‌టీ పీబీ డివిజన్ హెడ్ డాక్టర్ అనూప్‌కుమార్ తదితరుల సమక్షంలో ఆమె అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య విధానం అమలు చేస్తున్నందుకు తనకు ఈ అవార్డు లభించినట్లు తెలిపారు.

జగనన్న సురక్షతో సత్వర న్యాయం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: అర్హులందరికీ యూజర్ చార్జీలు లేకుండా సత్వరమే 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 97వ వార్డు పరిధి చాణక్యనగర్‌లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పలు కారణాల వల్ల అందుకోలేని వారిని అర్హులుగా గుర్తించేందుకు జగనన్న సరక్ష కార్యక్రమం ఉపయోగదాయకంగా ఉంటుందన్నారు. అర్హులు సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని సీఎం వైఎస్ జగన్ పాలన చేస్తున్నారన్నారు. ముఖ్యంగా లంచం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల చెంతకే చేరువవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా అర్హులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 97వ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్, జేసీఎస్ కన్వీనర్ జోబ్‌దాస్, పార్టీ నాయకులు చందు యాదవ్, రాంబాబు, సన్ని, విజయలక్ష్మి, మాధవి, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ పట్టభద్రులకు అపార అవకాశాలు

సబ్బవరం: కామర్స్ పట్టభద్రులకు అనేక ఉద్యోగ అవకాశాలు ఉండడంతో దేశంలో ఈ కోర్స్‌కు ఎంతో డిమాండ్ ఉందని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్య–అవకాశాలు లనే అంశంపై శనివారం విశాఖపట్నం చార్టర్–ఐసీఎస్ఐ సౌజన్యంతో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామర్స్‌లో డిగ్రీ చదివే విద్యార్థులకు కంపెనీ సెక్రటరీ కోర్సు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి మడగల గోవిందరావు మాట్లాడుతూ న్యాయ సూత్రాలు, అకౌంటింగ్ విధానాలు,సుపరిపాలన రీతులను మిళితం చేసే వృత్తి కంపెనీ సెక్రటరీ అని తెలిపారు.ఐసీఎస్ఐ విశాఖపట్నం చార్టర్ ప్రతినిధి శివరామ కృష్ణ బీకాం పూర్తయిన తర్వాత ఏ విధంగా కంపెనీ సెక్రటరీ కోర్సు పూర్తి చేయాలి, విభాగాలు, ఫీజులు, కాలపరిమితులు, తద్వారా ఉండే అవకాశాలను విశదీకరించారు.

పంచగ్రామాల భూ సమస్య పరిష్కరించాలి

సమైక్యప్రజా రైతు సంక్షేమ సంఘ ప్రతినిధుల డిమాండ్



ధర్నా చేస్తున్న సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘ కార్యదర్శి కృష్ణంరాజు, నాయకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పలుకాలనీల నిర్వాసితులతో కలిసి శనివారం సింహాచలంలో ధర్నా నిర్వహించారు. సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమస్య పరిష్కారం కోసం రెండుసార్లు కమిటీలు వేసినా ఎలాంటి ఫలితం లేదన్నారు. మరో వైపు ఇళ్ల నిర్మాణాలు, మరమ్మతులకు సైతం అనుమతించడం లేదన్నారు. మంత్రులు, ప్రజా ప్రతినిధు లు, జిల్లా అధికారులు ఇళ్ల మరమ్మతులు చేసు కోవచ్చని చెబుతున్నా... దేవస్థానం సిబ్బంది అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1996–97లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో దేవస్థానానికి ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.తద్వారా సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఎస్ గోపాలకృష్ణ,వ.ప్రతాప్, ఈశ్వరరావు, బి.అరుణ్‌కుమార్, కె.ఆర్.కె.ప్రసాద్, సీహెచ్. కోటేశ్వరరావు, ఎస్.రాజు, రమణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సెమిస్టర్ పుస్తకాల పంపిణీ

ఏయూక్యాంపస్: పాఠశాల విద్యాశాఖ అందించిన పాఠ్యపుస్తకాల పంపిణీని కలెక్టర్ ఎ.మల్లికార్జున శనివారం ప్రారంభించారు. శివాజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి పిల్లలకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతిని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్, ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోఫెల్ టీచింగ్ పరిశీలించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు ఉత్సాహంగా సమాధానమిచ్చారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్న విధానంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల వేళల్లోనే కాకుండా ఖాళీ సమయాలలోను రోజూ అదనపు తరగతులు నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇతర పాఠశాలల్లో ఈ విధానం అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త బి.శ్రీనివాసరావు, ఎంఈవో రామారావు, బాలామణి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రిటైర్డ్ అధికారులకు మెడికల్ స్కీమ్‌పై ఆప్షన్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పదవీ విరమణ అధికారుల మెడికల్ స్కీమ్‌పై యాజమాన్యం ఆప్షన్ ఇచ్చింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టీల్‌ప్లాంట్ నుంచి 2017 తర్వాత పదవీ విరమణ చేసిన అధికారులకు మొదట్లో గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ స్కీమ్ ఉండేది. ఆ స్కీమ్‌లో మార్పులు చేస్తూ పోస్టు రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్ (పీఆర్ఎంఎస్) పేరిట ఉక్కు యాజమాన్యం కొత్త స్కీమ్ ప్రవేశపెట్టింది. కొత్త స్కీమ్ పదవీ విరమణ అధికారులకు నష్టదాయకమని, పాత విధానాన్ని కొనసాగించాలని వారు యాజమాన్యాన్ని అభ్యర్థించారు. యాజమాన్యం నుంచి స్పందన రాకపోవడంతో విశ్రాంత అధికారుల సంఘం హైకోర్టును ఆశ్రయించింది. స్కీమ్ ఎంపికపై ఆప్షన్ ఇవ్వాలంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో యాజమాన్యం ఆప్షన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులపై ఉక్కు విశ్రాంత అధికారుల సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు హర్షం ప్రకటించారు.

జూలో పిల్లల పార్కులు



పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో పిల్లల కోసం ప్రత్యేకంగా రెండు చోట్ల పార్కులు సిద్ధం చేశారు. సీతాకోక చిలుకల పార్కు పక్కన ఒకటి, నెమళ్ల జోన్ సమీపం, కనుజుల ఎన్‌క్లోజర్ ఎదురుగా మరొకటి సిద్ధ ం చేసి.. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా జారుడు బల్లలు, ఊయలలు, రంగుల రాట్నాలు, తల్లిదండ్రులు సేదతీరడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. జూకు వచ్చే పిల్లలు వన్యప్రాణులను చూసి ఆనందించడంతో పాటు ఆటలాడుతూ సరదాగా గడపవచ్చు. అలాగే కనుజుల ఎన్‌క్లోజర్ ఎదురుగా పిల్లల పార్కులో మినీ కేఫ్‌టేరియా నిర్మించారు. దీన్ని జూ సిబ్బందే నిర్వహిస్తున్నారు. ఇక్కడ తినుబండారాలను విక్రయిస్తున్నారు.

కర్రలతో అపురూపాలు

- సరికొత్తగా కంబాలకొండ

ప్రకృతి ప్రదేశం కంబాలకొండ. హరితారణ్యాలు, పచ్చిక బయళ్లు, లోయలు, కొండలతో ప్రముఖ పర్యాటక కేంద్రంగా భాసిల్లుతోంది. ఎకో టూరిజం ప్రదేశంగా పర్యాటకులకు అసలుసిసలైన అనుభూతిని అందిస్తోంది. వర్షాకాలంలో వచ్చే నీటిని ఒక ట్యాంక్‌లో స్టోర్ చేసి, అందులో బోటింగ్‌కు అవకాశం కల్పిస్తారు. బోటింగ్‌లో విహరిస్తూ అటవీ అందాలను వీక్షించవచ్చు. ఇప్పుడు మరింత హంగులతో ముస్తాబైంది. కర్రలతో కుర్చీలు, బెంచీలు, మంచ్‌లు, టేబుళ్లు ఏర్పాటు చేశారు.

ఆరిలోవ: కంబాలకొండలో గతంలో నిర్మించిన క్యాంటీన్ శిథిలమైంది. దాన్ని తొలగించి ఆరు నెలల కిందట గడ్డి, వెదురు, కర్రలతో ఆధునీకీకరించారు. దాని ముందు ఇటీవల కర్రలతో ఆర్చ్ నిర్మించారు. క్యాంటీన్ ఆవరణలో కర్రలతో తయారు చేసిన బెంచీలు, దాని చుట్టూ కుర్చీలు, దానికి సమీపంలో మంచ్ నిర్మించారు. దీంతో పాటు కంబాలకొండ కొలను ఒడ్డున మరొక మంచ్ నిర్మించారు. సందర్శకులు ఆ మంచ్‌లపైకి ఎక్కి కంబాలకొండ అందాలు వీక్షిస్తూ ఫొటోలు తీసుకునే ఏర్పాటు చేశారు. వాటితో పాటు ఈ పార్కు లోపల మంచ్ ఆకారంలో కర్రల షెడ్ నిర్మించారు. దానిలో నాలుగు వైపులా బలమైన తాళ్లతో కట్టిన ఊయలలు, వాటి మధ్యలో కర్రల టేబుల్ ఏర్పాటు చేశారు. ఆ టేబుల్‌పై ఏవైనా తినడానికి పెట్టుకొని ఊయలు ఊగుతూ ఎంజాయ్ చేయవచ్చు. దీని పక్కనే వెదురు, అకేషియా చెట్ల కర్రలతో రౌండ్ టేబుల్ నిర్మించారు. చుట్టూ గుండ్రంగా కర్రలతో బెంచీ నిర్మించి, దాని మధ్యలో కొంత ఎత్తులో ఒక టేబుల్ ఏర్పాటు చేశారు. దీనిపై 10 మందికి పైగా కూర్చొని టిఫిన్, భోజనం చేయవచ్చు. వీటితో పాటు కర్రలతో చేసిన బెంచీలు 20కి పైగా పార్కులో మధ్యమధ్యలోను, రోడ్డు పక్కన అమర్చారు. దీంతో ఈ పార్కులో కొత్తదనం సంతరించుకొంది.



కర్రల కుర్చీలు, పక్కనే మంచ్

పర్యావరణ హితంగా..

సిమెంట్, ఇనుము తదితర గృహ నిర్మాణ సామగ్రి లేకుండా పర్యావరణ హితం కోరి వీటిని ఏర్పాటు చేశారు. వీటికి రంగులు వేయడంతో సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. కార్తీక మాసంలో నిత్యం ఇక్కడ వన భోజనాలతో కళకళలాడుతుంది. మిగిలిన రోజుల్లో సైతం పలు యూనియన్లు, సామాజిక వర్గాలు పిక్నిక్‌లు జరుపుకుంటుంటారు. పిక్నిక్‌ల కాలంలో ఈ కర్రల కుర్చీలు, టేబుళ్లు కుటుంబాలతో వచ్చేవారికి అనుకూలంగా ఉంటాయని కంబాలకొండ ఇన్‌చార్జి శివప్రసాద్ తెలిపారు.

మర్యాద పూర్వక కలయిక



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను సత్కరిస్తున్న డీఈ అప్పన్నబాబు

సింహాచలం: పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను శనివారం రాంపురంలోని ఆయన కార్యాలయంలో ఈపీడీసీఎల్ పెందుర్తి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు స్వీకరించిన సిరికి అప్పన్నబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పెందుర్తి ఏఈ రవి, వేపగుంట ఏఈ రమణమూర్తి పాల్గొన్నారు.

25న రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ సమావేశం

డాబాగార్డెన్స్ : ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ, ఈపీడీసీఎల్ డిస్కం కార్యవర్గ సమావేశం ఈ నెల 25న విశాఖలో గల వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్టు జేఏసీ చైర్మన్ వీఎస్ఆర్‌కే గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించనున్న సమావేశానికి ఏపీ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ కేంద్ర కార్యవర్గ ముఖ్య నాయకులు పాల్గొంటున్నట్టు తెలిపారు. డిస్కం పరిధిలో గల అన్ని కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, డిస్కం ముఖ్య ప్రతినిధులు, జేఏసీ కార్యవర్గ సభ్యులు పాల్గొనాలని కోరారు.

వెంకటాద్రికి పోటెత్తిన భక్తులు



వెంకన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్

సింహాచలం: పెందుర్తిలోని వెంకటాద్రికి శనివారం భక్తులు పోటెత్తారు. గిరిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తరించారు. ఉదయం సుప్రభాతసేవ, తోమాలసేవ, ఆరాధన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి తిరునక్షత్రం పురస్కరించుకుని అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు.భక్తులకు ప్రసాదం అందజేశారు.అర్చకుడు రామానుజమ్ ఈ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో నీలిమ పాల్గొన్నారు.

29న గర్భిణులకు ప్రత్యేక యోగా శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం, కృష్ణా హెల్త్ సెంటర్ సంయుక్తంగా ఈ నెల 29న గర్భిణులకు ప్రత్యేకంగా యోగా వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య కె.రమేష్ బాబు తెలిపారు. వర్క్‌షాపులో భాగంగా కృష్ణా హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ వి.రఘురామ కృష్ణంరాజు పాల్గొని సూచనలిస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని.. రిజిస్ట్రేషన్ కోసం 91008 55823కు ఫోన్ చేయాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

జీవీఎంసీ అధికారులకు మేయర్ గొలగాని ఆదేశం



చెరువులో గంభూషియా చేపలు వదులుతున్న మేయర్ గొలగాని, కార్పొరేటర్ ముమ్మన

సింహాచలం: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వ్యాప్తిని అరికట్టడంతోపాటు, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. జోన్–8 పరిధిలోని 95వ వార్డులోని పురుషోత్తపురంలో శనివారం సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. డెంగ్యూ కారక దోమలను అరికట్టేందుకు పురుషోత్తపురంలోని చెరువులో కార్పొరేటర్ ముమ్మన దేముడుతో కలపి గంభూషియా చేపలను వదిలారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులకు కారణమైన దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతీ ఏరియాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మలేరియా సిబ్బంది ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలని ఆదేశించారు. డెంగ్యూ కారక దోమలు నీటిలోనే వృద్ధి చెందుతాయన్నారు. ముఖ్యంగా పూలకుండీలు, ఫ్రిజ్‌ల వెనుకభాగంలో, నీటి తొట్టెల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. గంభూషియా చేపల వల్ల దోమలను నియంత్రించవచ్చని, నీటిలో ఉన్న దోమల లార్వాను తినేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, మలేరియా అధికారి సాంబమూర్తి, 8వ జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- రూ.2.05 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- డీఎస్పీ సత్యనారాయణ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు చాకలిపేటలో ఈ నెల 20న జరిగిన చోరీ కేసుకు సంబంధించి రెండు రోజుల వ్యవధిలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ చోరీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. నాయుడుపాలెం శివారు చాకలిపేట గ్రామానికి చెందిన సిరుముళ్ల పైడిరాజు ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నారు. పైడిరాజు విధులకు వెళ్లే క్రమంలో ఈ నెల 20న ఉదయం 8 గంటలకు భార్య, కుమార్తెను తన ద్విచక్ర వాహనంపై ఎన్టీపీసీకి వెళ్లాడు. అదే రోజు మధ్యాహ్నం 1.30 గంట కు ఇంటి వద్ద మేకలకు గడ్డి వేయడానికి వచ్చిన పైడిరాజు బెడ్‌రూమ్ వైపు చూశాడు. బెడ్‌రూమ్ తలుపులు తెరచి ఉన్నాయి. లోపలి బీరువా తలుపులు విరగ్గొట్టి దుస్తులు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో భద్రపర్చిన బంగారు ఆభరణాలు రెండు తులాల పుస్తెల తాడు, రెండున్నర తులాల హారం, రెండున్నర తులాల నక్లెస్ వెరసి ఎనిమిదిన్నర తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని పైడిరాజు ఫిర్యాదు చేశాడని డీఎస్పీ చెప్పారు. వెంటనే డ్యాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంలను రంగంలోకి దించి ఆధారాలు సేకరించడం జరిగిందని చెప్పారు. నేర స్థలంలో లభించిన ఆధారాలను బట్టి ముద్దాయి సిరుముళ్ల దేవరాజు(28)ను పరవాడ సంతబయలు వద్ద శనివారం అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనపర్చుకొని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ చెప్పారు. స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు విలువ రూ.2.05 లక్షలు ఉంటుందని తెలిపారు. రెండు రోజుల వ్యవధిలోనే నేరస్తులను పట్టుకోవడంలో కృషి చేసిన క్రైం ఏఎస్ఐ బి.వై.నాయుడు, సిబ్బంది ఎస్. నాగేంద్ర, జి.వి.వి.ఎస్ నాయుడులను డీఎస్పీ సత్యనారాయణ అభినందించారు. సమావేశంలో సీఐ పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

100 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన



100 మీటర్ల జాతీయ జెండాను పదర్శిస్తున్న సంతపాలెం పాఠశాల విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పరిధి సంతపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం 100 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన చేపట్టారు. భారతీయ పతాక ఆమోద దినోత్సవం సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సిరికి శ్రీనివాసరావు మాట్లాడుతూ పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకాన్ని 1947 జూలై 22న రాజ్యాంగ పరిషత్ ఆమోదించిందన్నారు. జాతీయ పతాకం గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు పద్మావతి, వాణి, విజయభాను తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన ఆర్పీ పట్నాయక్

మ్యూజిక్ కోర్సుల పరిశీలన



సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సినీ సంగీత దర్శకుడు ఆర్.పి. పట్నాయక్ శనివారం సందర్శించారు. ఏయూలో తాను చదువుకున్న రోజులు, వర్సిటీ హాస్టల్స్‌లో గడిపిన సమయం, ఏయూలో నిర్వహించిన సాంస్కృతిక సమ్మేళనంలో పాల్గొన్న రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సినీ సంగీత రంగానికి నిపుణులను అందించే విధంగా వర్సిటీలో నిర్వహిస్తున్న సౌండ్ ఇంజినీరింగ్ కోర్సులు, నూతనంగా ఏర్పాటు చేసిన డీజీఎస్ స్టూడియో తదితర అంశాలను రిజిస్ట్రార్ ఆయనకు వివరించారు. ఏయూ సాధిస్తున్న ప్రగతిపై ఆర్.పి పట్నాయక్ అమితమైన ఆనందాన్ని వ్యక్తం చేశారు. వర్సిటీ తరఫున ఆర్.పి. పట్నాయక్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య ఎన్.ఏ.డి. పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.